సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023



నెలవంక కోసం ఆకాశం వంక..

నెల రోజుల పాటు ప్రార్థనల్లో లీనమైన ముస్లింలు శుక్రవారం సాయంత్రం షవ్వాల్ నెలవంక కోసం ఎదురు చూస్తారు. - 8లో



మిషన్ వాత్సల్యతో ఆర్థిక భరోసా


అనాథలుగా మారిన పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకం భరోసాగా నిలుస్తోంది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.90
రెండోరకం	రూ.50	రూ.72

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 270 మెట్రిక్ టన్నులు





న్యూస్‌రీల్

రేపు టమాట మార్కెట్‌కు సెలవు

మదనపల్లె సిటీ: రంజాన్ పండుగను పురస్కరించుకుని టమాట మార్కెట్‌కు ఈనెల 22న శనివారం సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి అభిలాష్ తెలిపారు. టమాట రైతులు శుక్రవారం సాయంత్రం మార్కెట్‌కు టమాటలు తీసుకురావద్దని సూచించారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

సంబేపల్లె: మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల, యర్రగుంట్ల అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యాలయాల్లోని 66 మంది విద్యార్థులకు జిల్లా వైద్యాధికారి కొండయ్య గురువారం కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలలో 33 మంది, యర్రగుంట్ల బాలికల కళాశాలలో 33 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి వారికి కంటి అద్దాలను పంపిణీ చేశామన్నారు. దృష్టిలోపం వలన విద్యార్థులకు చదువు కుంటుపడకుండా ఈ అద్దాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం డాక్టర్ డియాజ్, డీఎస్ఎం డాక్టర్ విష్ణు, వైద్యులు భగవద్గీత, తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీహరికోటకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

మదనపల్లె సిటీ: శ్రీహరికోట శాటిలైట్ లాంచింగ్ వీక్షించేందుకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 22న శాటిలైట్ లాంచింగ్ ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో అంకాలమ్మ దేవాలయం, పులికాట్ సరస్సు, నేలపట్టులను సందర్శించవచ్చన్నారు. పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9959225677 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

24న శ్రీ కృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ

మదనపల్లె : పట్టణ నడిబొడ్డున మల్లికార్జున సర్కిల్‌లో ఈనెల 24న శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు టీటీడీ బోర్డ్ మెంబర్ పోకల అశోక్ కుమార్ తెలిపారు. గురువారం మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి, బలిజ సేవాసమితి అధ్యక్షుడు బీపీఎల్.విజయకుమార్, ఈసీ మెంబర్స్‌తో కలిసి విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి తన సొంత నిధులతో విగ్రహాన్ని సమకూరుస్తామని ముందుకు వచ్చారన్నారు. విగ్రహ ఆవిష్కరణలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్ బాషా తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. బలిజ సేవాసమితి సభ్యులు పగడాల సూరి, సూపర్‌మార్కెట్ శ్రీనివాసులు, రాజ్‌భవన్‌రాజా పాల్గొన్నారు.

వైవీయూలో లా పరీక్షల తనిఖీ



సెమిస్టర్ పరీక్షలను తనిఖీ చేస్తున్న వీసీ ఆచార్య జింక రంగజనార్దన్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో జరుగుతున్న న్యాయశాస్త్ర సెమిస్టర్ పరీక్షలను వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగజనార్దన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డితో కలిసి వీసీ ఏపీజే అబ్దుల్‌కలాం గ్రంథాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల ఏర్పాట్లు, సౌకర్యాలపై సహాయ సూపరింటెండెంట్ డాక్టర్ మునికుమారి వీసీకి వివరించారు. 740 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 628 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. అనంతరం వీసీ చీఫ్ సూపరింటెండెంట్ చాంబర్‌లో ఉన్న సీసీ కెమెరాల్లో పర్యవేక్షణను గమనించారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని పరీక్షల విభాగానికి ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో పరీక్షల విభాగం చీఫ్ సూపరింటెండెంట్ ఆచార్య టి. శ్రీనివాస్, సహ ఆచార్యులు డాక్టర్ కాత్యాయని, డాక్టర్ విజయ్ కుమార్‌నాయుడు, పీఆర్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సేవకు పురస్కారం

- జిల్లాలో 7975 మంది వలంటీర్లు
- ప్రజలకు విశేష సేవలు అందించిన వారికి ప్రత్యేకంగా సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర కేటగిరీల్లో పురస్కారాలు
- ఎంపికైన వారికి రూ. 10 వేలు, 20 వేలు, 30 వేలు చొప్పున ప్రోత్సాహకం
- ఇప్పటికే జిల్లాకు చేరిన పతకాలు, సర్టిఫికెట్లు
- కార్యక్రమాల నిర్వహణకు అధికారుల సన్నాహాలు



సాక్షి రాయచోటి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా అందించడంలో విశేష సేవలు అందిస్తున్న వలంటీర్లను ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోంది. పేదలకు సంబంధించి ఎలాంటి తారతమ్యాలు చూపకుండా సకాలంలో సంక్షేమాన్ని అందిస్తున్న వలంటీర్లను సత్కారాలతో గౌరవించి ప్రోత్సహించాలని సంకల్పించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఎక్కడా లేని విధంగా వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. అయితే వారికి నెలనెలా రూ. 5 వేలు చొప్పున గౌరవ వేతనం కింద ఇస్తున్న ప్రభుత్వం.. విశేష సేవలు అందిస్తున్న వారికి ప్రభుత్వం తరుపున ప్రోత్సహించాలని నిర్ణయించింది. అందులో భాగంగా గతేడాది విశిష్ట సేవలు అందించిన వారికి వివిధ రకాల ప్రోత్సాహకాల కింద నగదుతోపాటు శాలువా, జ్ఞాపిక, సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నారు.

అర్హతల ఆధారంగా ఎంపిక

అన్నమయ్య జిల్లాలో మున్సిపాలిటీలతోపాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 7975 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వారిని ప్రభుత్వం మూడు కేటగిరీల కింద ఎంపిక చేసి నగదు ప్రోత్సాహకంతోపాటు ఇతర సత్కారాలు చేయనుంది. సేవా మిత్ర కింద ఎంపిక చేసిన వలంటీర్లకు రూ. 10 వేలు చొప్పున, సేవా రత్న కింద ఎంపిక చేసిన వారికి రూ. 20 వేలు, సేవా వజ్ర కేటగిరి కింద ఎంపికైన వారికి ఒక్కొక్కరికి రూ. 30 వేలు చొప్పున అందించనున్నారు. జిల్లాలో సేవా వజ్ర కింద 26 మంది ఎంపిక కాగా, సేవా రత్న కింద 171మంది ఎంపికయ్యారు. అలాగే సేవా మిత్ర కేటగిరీ కింద 7778 మంది ఎంపికయ్యారు. వలంటీర్లకు సంబంధించి ప్రతినెల 1వ తేదీ తెల్లవారుజామునే పెన్షన్ల పంపిణీ, ఇతర ప్రాంతాల్లో లబ్ధిదారులు ఉన్నప్పటికీ అక్కడికే వెళ్లి సంక్షేమం అందించడం, సకాలంలో సేవలు అందించే విధానంలో సర్వేలు సత్వరమే పూర్తి చేయడం, ఆన్‌లైన్ లిస్టుల వెరిఫికేషన్, లబ్ధిదారుల జాబితా, ఇతర సేవలు, సంక్షేమ ఫలాల జాబితా తయారీలో వేగంగా స్పందించడం , ఇతర అన్ని వ్యవహారాల్లో చురుగ్గా వ్యవహరించే వారిని ప్రభుత్వం ఈ అవార్డులకు అర్హతలను బట్టి ఎంపిక చేసింది.

అతి త్వరలో సత్కారాలు

రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండవ ఏడాది వలంటీర్లను సత్కరించేందుకు సిద్ధమైంది. ఉగాది పండుగ సందర్భంగా సత్కారాలు చేయాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల ఆలస్యమైంది. ఈనెలాఖరులోపు లేదా మే మొదటి వారంలోగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో వలంటీర్ల సేవల ఆధారంగా మూడు కేటగిరీల వారీగా పేర్లను సిద్ధం చేశారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



అన్నమయ్య జిల్లాలో వలంటీర్లకు సంబంధించి మూడు విభాగాల్లో విశేష సేవలు అందించిన వారిని గుర్తించాం. ప్రతిఫలం ఆశించకుండా ప్రజలకు సేవలు అందించడం ప్రశంసనీయం. దేశంలో ఎక్కడా లేని విధంగా మనకు మాత్రమే వలంటీర్ల వ్యవస్థ ఉంది. అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు కష్టపడుతున్న వలంటీర్లను ప్రతి ఏడాది సత్కరిస్తున్నాం. ఈమారు కూడా ఎంపికైన వలంటీర్లకు త్వరలోనే సన్మానంతోపాటు నగదు పారితోషికం, సర్టిఫికెట్లను అందించనున్నాం.
– గిరీషా పీఎస్, జిల్లా కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

త్వరితగతిన భూసేకరణ

కలెక్టర్ గిరీషా పీఎస్



భూసేకరణ అంశంపై అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : సప్లై ఛానల్స్, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు సంబంధించి భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్లను కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఝరికోన, గాలివీడు, రామాపురం, లక్కిరెడ్డిపల్లె సప్లై ఛానల్స్, లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ వేగవంతంపై సంబంధిత తహసీల్దార్లు, ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఝరికోన, గాలివీడు, రామాపురం, ఎల్ఆర్ పల్లె సప్లై ఛానల్, లిఫ్ట్ ఇరిగేషన్‌కు అవసరమైన భూసేకరణను ఎంత చేశారన్న అంశంపై ఆరా తీశారు. గాలివీడు లిఫ్ట్ స్కీం సంబంధించి రాయచోటి మండలంలో 2 గ్రామాలు, గాలివీడు మండలంలో 6 గ్రామాల్లో మొత్తం 39.290 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. ఝరికోన లిఫ్ట్ ఇరిగేషన్ సంబంధించి సంబేపల్లె మండలంలోని 2 గ్రామాల్లో 26.290 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందన్నారు.

భూసేకరణలో భాగంగా డిక్లరేషన్, అవార్డు, పొజిషన్, హ్యాండ్ ఓవర్ తదితర ప్రక్రియలను త్వరగా పూర్తి చేయాలన్నారు. లిఫ్ట్ స్కీం రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలంలో మొత్తం 71.323 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. అలాగే సప్లై ఛానల్‌కు సంబంధించి రామాపురం మండలం హసనాపురంలో 6.174 ఎకరాలు, లక్కిరెడ్డిపల్లె మండలంలోని దిన్నెపాడు, బి.ఎర్రగుడి, కుర్నూతల, మద్దిరేవుల గ్రామాలలో 35.151 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. గాలివీడు లిఫ్ట్ స్కీం సంబంధించి 23వ తేదీ కల్లా ఫారం సి ఇవ్వాలన్నారు. మే 15 కల్లా అవార్డ్ కావాలని ఆదేశించారు. అలాగే సప్లై ఛానల్ సంబంధించి ఎర్రగుడిపల్లె, హసనాపురం పెగ్ మార్క్ ఆదివారం లోపల పూర్తి చేయాలన్నారు. గురువారం కల్లా సబ్ డివిజన్ పూర్తి కావాలని సర్వే శాఖ ఏడీని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, ఇరిగేషన్ జిల్లా అధికారి కృష్ణమూర్తి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్, కలెక్టరేట్ భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ మహేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడు పనులపై ప్రతివారం సమీక్ష

రాయచోటి : మన బడి నాడు నేడు పనుల పురోగతిపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. జిల్లాలో చేపట్టిన మన బడి – నాడు నేడు రెండో విడత పనులను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోపు పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మన బడి–నాడు నేడు రెండో విడత పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జూన్ 12వ తేదీ లోపల మనబడి – నాడు నేడు రెండో విడత పనులన్నీ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మొత్తం రూ.38.57 కోట్లు రివాల్వింగ్ ఫండ్ హెచ్‌ఎం ఖాతాలలో జమ అయిందన్నారు. మండల విద్యా శాఖ అధికారులు తమపరిధిలో మంజూరైన పాఠశాలలను తనిఖీ చేసి పనులను పర్యవేక్షించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈఓ పురుషోత్తం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్, పీఎస్‌డబ్ల్యుఎస్ పీఓ మనోహర్‌రాజు, సమగ్ర శిక్ష సీఎంఓ కరుణాకర్, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎస్ఐల బదిలీ

రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలో ఎస్ఐల బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. గురువారం అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు జిల్లాలోని 16 మంది ఎస్ఐలకు స్థానచలనం కలిస్తూ ఆదేశాలు జారీ చేశారు. బదిలీల వివరాలు ఇలా ఉన్నాయి. ఈ బదిలీ ఉత్తర్వులను ఆయా స్టేషన్ల ఎస్ఐలకు కూడా పంపారు.

ప్రస్తుత స్టేషన్	ఎస్ఐ పేరు	బదిలీ స్టేషన్
లక్కిరెడ్డిపల్లి	వినోద్ కుమార్	పెద్దమండ్యం
ఎస్పీ కార్యాలయం	ఎస్ఎండీ రఫీ	రాయచోటి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్
కలికిరి	సి.లోకేశ్వర్‌రెడ్డి	మదనపల్లె టూ టౌన్
సుండుపల్లె	పి.రామకృష్ణ	నిమ్మనపల్లి
ఎస్పీ కార్యాలయం	బి.రామకృష్ణారెడ్డి	సుండుపల్లె
బంగారుపాలెం (చిత్తూరు జిల్లా)	మల్లికార్జున రెడ్డి	లక్కిరెడ్డిపల్లి
రాయచోటి సీసీఎస్	వి.నాగేశ్వరరావు	వాయలపాడు పోలీస్ స్టేషన్
నిమ్మనపల్లి	ఫాతిమా	రాయచోటి డీసీఆర్‌బీ
మదనపల్లి టూ టౌన్	సి.చంద్రశేఖర్	రాయచోటి సీసీఎస్
పీటీఎం	సి.మధురామచంద్రుడు	రాయచోటి డీఎస్‌బీ
పెద్దమండ్యం	పి.వెంకటేష్	మదనపల్లి తాలుకా
రామసముద్రం	డి.రవీంద్రబాబు	పీటీఎం
వాయల్పాడు-1	బిందు మాధవి	రాయచోటి పీసీఆర్
రాయచోటి వీఆర్	శ్రీ కృష్ణమూర్తి	వాయల్పాడు పీఎస్-2,
రాయచోటి ఎస్‌బీ	కె.శ్రీనివాస్ రెడ్డి	దిశ పీఎస్

భద్రకాళీ సమేతుడికి అమావాస్య పూజలు

రాయచోటిటౌన్ : రాయచోటి భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి అమావాస్య పూజలు నిర్వహించారు. గురువారం మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, పూజలు చేసి రంగు రంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి మాఢవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమం ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలం రెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు నాగభూషణం, సురేష్ కుమార్, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ పూజలలో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళీ సమేతుడు

ముస్లిం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట



ఈద్గా మసీదులో ప్రత్యేక రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల తదితరులు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల

కలికిరి: రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి అన్నారు. కలికిరి పట్టణంలోని ఏహెచ్‌సీ కల్యాణ మండపంలో గురువారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రాస్‌రోడ్డులోని ఈద్గా మసీదులో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీల అభివృద్ధికి కట్టుబడి ఉందని గుర్తుచేశారు. రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆఘామొహిద్దీన్, నియోజకవర్గ పరిశీలకుడు సహదేవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి, ముస్లిం మైనారిటీ నేతలు పాల్గొన్నారు.

తొలిరోజే కానుక!

- జగనన్న విద్యా కానుక కిట్లు సిద్ధం
- బడితెరిచిన తొలిరోజే పంపిణీకి కసరత్తు
- గతానికి భిన్నంగా మండల స్థాయిలో స్టోరేజీ పాయింట్లు
- కిట్ల నిల్వ, రవాణాకు జిల్లా, మండల స్థాయి కమిటీలు
- వ్యక్తిగతంగా విద్యార్థుల కొలతలను సేకరించిన అధికారులు



స్టాక్‌పాయింట్‌కు వచ్చిన డిక్షనరీలు

జిల్లా సమాచారం

విద్యార్థులు:	1,54,789
బాలికలు:	75,435
బాలురు:	79,354
బ్యాగులు:	1,54,789
యూనిఫాం:	1,54,789
నోట్‌బుక్స్:	8,87,786
బెల్ట్స్ :	1,10,380
బూట్లు:	1,53,818
డిక్షనరీలు:	17,750

స్టాక్ పాయింట్లు...

మండల స్థాయిలో :	30
జిల్లా స్థాయిలో :	01

మదనపల్లె సిటీ: జిల్లాలో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది కిట్ల పంపిణీలో మరింత పారదర్శకతతో పాటు వేగంగా విద్యాకానుక అందించేందుకు కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఈ ఏడాది విద్యాకానుక సామగ్రిని ఆయా మండల హెడ్‌క్వార్టర్స్‌కు నేరుగా వచ్చేలా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర స్థాయి నుంచి మండల స్టాక్ పాయింట్లకు మే 1 నుంచి 31వతేదీలోపు.. అక్కడి నుంచి జూన్ 1 నుంచి 12వతేదీలోపు అన్ని స్కూల్స్‌కు అందేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అంటే వేసవి సెలవుల తర్వాత విద్యార్థులు బడికి వచ్చిన మొదటి రోజే జేవీకే కిట్లను అందించనున్నారు. గతంలో విద్యార్థి తల్లి మాత్రమే వచ్చి కిట్ తీసుకువెళ్లాలనే నిబంధన ఉండేది. ఇప్పుడు తల్లితో పాటు తండ్రి, విద్యార్థి కూడా బయోమెట్రిక్ వేసి తీసుకెళ్లవచ్చు.

విద్యాకానుక కిట్‌లో...

బ్యాగు, అచ్చుపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, షూ, బెల్టు, రెండు రకాల డిక్షనరీలు అందించనున్నారు. ఇవి 1 నుంచి 10వ తరగతి విద్యార్థులందరికి అందించగా... బెల్టులకు సంబంధించి 1 నుంచి 10వతరగతి విద్యార్థులకు, 1 నుంచి 5వతరగతి బాలికలకు అందిస్తారు. అలాగే నోట్‌బుక్స్‌ను 6 వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు, డిక్షనరీలు 1 నుంచి 6వ తరగతి వరకు చదివే విద్యార్థులకు అందిస్తారు. ఇందుకు సంబంధించి గత ఏడాది డిసెంబర్ నుంచే విద్యార్థుల వివరాలను సేకరించడంతో పాటు వారికి సరిపడే విధంగా బూట్లు, యూనిఫాం కొలతలను సేకరించారు.


మండల స్థాయిలో స్టాక్ పాయింట్లు

జగనన్న విద్యాకానుకను గతంలో మాదిరిగా కాకుండా ఈ ఏడాది విద్యార్థులకు మరింత వేగంగా చేరువ చేసేందుకు ప్రతి మండల కేంద్రంలో స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. విద్యాకానుకకు సంబంధించిన సామగ్రి జిల్లా స్టాక్ పాయింట్‌కు కాకుండా ఈ ఏడాది నేరుగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌కు రానుంది. స్టాక్ పాయింట్‌కు వచ్చిన వస్తువులన్నింటిని ఒక కిట్టు రూపంలో సిద్ధం చేసి అన్ని వస్తువులను ఒకేసారి విద్యార్థులకు అందించనున్నారు. దీంతో పాటు వీటి పంపిణీ పర్యవేక్షణకు ఒక కమిటీని నియమించారు. ఇందులో స్టోరేజీ పాయింట్ చైర్మన్‌గా ఎంఈఓను, కన్వీనర్‌గా పాఠశాల హెచ్‌ఎం, సభ్యులుగా వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం, మండల ఇంజినీరింగ్ అధికారి, సీఆర్పీలను నియమించారు. వీరంతా విద్యాకానుక కిట్లు పాఠశాలలకు చేరవేసే సమయంలో కూడా అన్ని రికార్డులను మెయింటెన్ చేయాల్సి ఉంటుంది.

జిల్లా పరిశీలకుడిగా వెంకటకృష్ణారెడ్డి

జగనన్న విద్యాకానుక పంపిణీకి జిల్లా పరిశీలకులుగా రాష్ట్ర మోడల్ స్కూల్స్ జేడీ మార్తల వెంకటకృష్ణారెడ్డిని నియమించారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో పర్యటించి జేవీకే స్టోరేజీ పాయింట్లను తనిఖీ చేశారు.

పక్కాగా పంపిణీ



జగనన్న విద్యాకానుక కోసం మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన స్టోరేజీ పాయింట్లను పరిశీలిస్తున్నాం. నిల్వ ఉంచేందుకు తగిన వసతి ఉందా, వర్షం వస్తే తడుస్తాయా, విద్యాకానుక కిట్లకు భద్రత ఎలా ఉందనే అంశాలన్నింటిని పరిశీలిస్తున్నాం. దీంతో పాటు విద్యాకానుక కమిటీలతో చర్చిస్తున్నాం. –పురుషోత్తం, జిల్లా విద్యాశాఖాధికారి, రాయచోటి

మార్గదర్శకాలు ఇచ్చాం

2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జేవీకే కిట్టును విద్యార్థులకు సకాలంలో అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. దీంతో పాటు ఈ ఏడాది నూతనంగా మండల స్థాయిలో స్టోరేజీ పాయింట్లను గుర్తించాం. జేవీకే సామగ్రి ఇప్పుడు నేరుగా మండల స్థాయి స్టోరేజీ పాయింట్లకు చేరుతుంది.
–కరుణాకర్, సీఎంఓ, సమగ్రశిక్ష, రాయచోటి

టీ20 జట్టుకు వాల్మీకిపురం క్రీడాకారులు



దీపన్ సాయి



ఫయాజ్ అలీ

వాల్మీకిపురం : జిల్లా క్రికెట్ సీనియర్ టీ-20 క్రికెట్ జట్టుకు జిల్లా క్రికెట్ సబ్ సెంటర్, వాల్మీకిపురం నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారని బీసీసీఐ లెవెల్-1 సబ్ సెంటర్ కోచ్ సునీల్ కుమార్ గురువారం తెలిపారు. బీజీసీఏసీడీ ఆధ్వర్యంలో జిల్లా ఎంపికలు జరిగాయన్నారు. ఈ ఎంపికకు వాల్మీకిపురం క్యాంపు నుంచి 9 మంది ప్రాబబుల్స్ ఎంపిక కాగా మ్యాచ్‌టీం జిల్లా జట్టుకు వీరిలో ఇద్దరు ఎంపికైనట్లు తెలిపారు. ఎడమ చేతివాటం బౌలర్ దీపన్ సాయి, మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ ఫయాజ్ అలీలు ఎంపికైన వారిలో ఉన్నారు. వీరి ఎంపిక పట్ల జీవీఎస్‌సీఎస్‌వీసీసీ అధ్యక్షుడు శ్రీధర్ కుమార్, గ్రౌండ్ ఇన్‌చార్జ్ షాహెద్, భరత్, సీనియర్ క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

మహిళపై దాడి
– ఆరుగురిపై కేసు

కలికిరి : మహిళపై దాడి చేసి గాయపరచిన కేసులో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధికి చెందిన షేక్ గౌసియా మస్తానీ ఈ నెల 17న రాత్రి తన ఇంటి ముందు ఉండగా అదే సమయంలో అక్కడికి వచ్చిన అబు ఆమె ఉంటున్న ఇంటి యజమానికి ఆమెపై తప్పుడు సమాచారమిస్తుండగా ఎందుకని నిలదీసింది. దీంతో దుర్భాషలాడి దౌర్జన్యం చేసిన అబు, అంతటితో ఆగకుండా తన స్నేహితులైన హనీఫ్, జాకీర్, ఆరిఫ్, యాసీన్, మహ్మద్‌లను తీసుకు కొచ్చి మహిళపై దాడి చేసింది. జరిగిన అన్యాయంపై పెద్దమనుషులను ఆశ్రయించినా ఆమెకు న్యాయం జరగకపోవడంతో గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్.అబు, అతని స్నేహితుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, తన భర్త జీవనాధారం నిమిత్తం కువైట్‌లో ఉండటంతో తనకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

గాయపడిన ఆటోడ్రైవర్ మృతి



అజయ్ (ఫైల్)

బి.కొత్తకోట : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఆటోడ్రైవర్ కే.అజయ్ (19) బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎస్‌ఐ రామమోహన్ కథనం మేరకు వివరాలు..గత శనివారం బి.కొత్తకోట బీసీకాలనీకి చెందిన అజయ్ (19), పెద్దతిప్పసముద్రం మండలం బెట్టకొండకు చెందిన మిత్రుడు వెంకటేష్ (24), స్థానిక దళితవాడకు చెందిన నరేష్ (20), దేగానిపల్లెకు చెందిన పృధ్వీ (20) ఆటోలో మదనపల్లె నుంచి బి.కొత్తకోటకు వస్తుండగా ఈడిగపల్లె వద్ద లారీ ఢీకొంది. ఈ ఘటనలో అజయ్ పక్కన కూర్చున్న వెంకటేష్ దుర్మరణం చెందాడు. ఆటో నడుపుతున్న డ్రైవర్ అజయ్ తలకు తీవ్రగాయాలు కావడంతో వైద్యం కోసం తిరుపతి స్విమ్స్ తరలించారు. అక్కడ చికిత్సపొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకొంటూ జీవిస్తున్నారు. కుమారుని మృతితో తల్లడిల్లిపోతున్నారు.

నెలవంక కోసం ఆకాశం వంక..

కరుణ చూపే ఘడియ కోసం ఎదురుచూపు



జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మదనపల్లె సిటీ : రోజంతా కఠిన ఉపవాసం... దైవంపైనే మనసు లగ్నం... పవిత్ర ఖురాన్ పఠనం, శ్రవణం.. తోటివారిపై ప్రేమ, సోదరభావం..పేదలపై దయ, కరుణ, దాన,ధర్మాలు.. ఇలా శుభాల వసంతం రంజాన్ మాసమంతా ముస్లింలు నియమనిష్టలు... దైవచింతనతో గడిపారు. చివరి ఘడియలు అసన్నం కావడంతో శుక్రవారం ఆ నెలవంక కోసం ఆకాశం వంక ఎదురు చూడనున్నారు.

నెల రోజుల పాటు సహరీ, ఇఫ్తార్, తరావీజ్ ప్రార్థనల్లో లీనమైన ముస్లింలు శుక్రవారం సాయంత్రం షవ్వాల్ నెలవంక కోసం ఆకాశం వంక వేయికళ్లతో ఎదురు చూస్తారు. ఇఫ్తార్ సమయంలో పేలే బాణాసంచా మందు,భానుడు పశ్చిమ సంద్రంలో మునిగే సమయంలో అందరి చూపు ఆకాశం వైపే ఉంటుంది. నీలి మేఘాల మాటు నుంచి అరుణాచల కాంతులతో వెలిగే అర్ధ అకార చంద్రుడు.. కనపించగానే అందరిలో ఆనందం వెల్లివిరుస్తుంది. 'ఈద్ కా చాంద్ నజర్ ఆగయా... సబ్ కో ఈద్ ముబరాక్' అంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, ఈద్ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. అంబరాన్నంటే సంబరాలు చేసుకుంటారు.

ఈద్గా, మసీదుల ముస్తాబు

ఈద్ ప్రార్థనల కోసం జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, వాల్మీకిపురం, గుర్రంకొండ, బి.కొత్తకోట ప్రాంతాలతో పాటు ముస్లింలు గణనీయ సంఖ్యలో ఉన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఈద్గాలు,మసీదులు ముస్తాబవుతున్నాయి.మరోవైపు ముస్లిం సోదరులు ఇంటిల్లిపాది కొత్తగా కొనుగోలు చేసి దుస్తులను చూసి మురిసిపోతున్నారు. ఆడపడుచులు బిరియానీ మసాలాల తయారీలో లీనమవుతున్నారు. చిన్నారులు తమ చేతులను మెహందీతో అలంకరించుకుంటున్నారు.

నెలవంక దర్శనంతోనే నిర్ణయం

షాబాన్ నెల 30వ రోజున రంజాన్ నెలవంక దర్శనంతో ఉపవాసదీక్షలను ప్రారంభించడం, 30 రోజుల అనంతరం షవ్వాల్ నెలవంక దర్శనంతో ఉపవాసదీక్షలను ముగించి ఈదుల్ ఫితర్ పండుగను జరుపుకోవడంలోనూ నెలవంక దర్శనమే కీలకం. చాలా సందర్భాల్లో రంజాన్ నెల వంక వాతావరణ ప్రభావంతో కనిపించనప్పుడు మతగురువులు ముఖ్యంగా ప్రభుత్వ సర్‌ఖాజీలు, హాఫీజ్‌సాబ్‌లు సమావేశమై రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల్లోని ముఫ్తీలు, హిలాల్ కమిటీలతో సమన్వయం చేసుకుని చంద్రుని దర్శన సమాచారం తెప్పించుకుంటారు. వారి నిర్ణయంతోనే రంజాన్ పండుగను నిర్ణయిస్తారు. ఇస్లాం కాలమానంలో ఓ నెల 29 రోజులు, మరో నెల 30 రోజులు కావడంతో కొన్ని సమయాల్లో సందిగ్ధత ఏర్పడుతుంది. శుక్రవారం నెలవంక దర్శనమైతే శనివారం పండుగ జరుపుకుంటారు. లేనిపక్షంలో ఆదివారం ఈద్ జరుగుతుంది.

లైలతెల్ జాయెజా

పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా షవ్వాల్ నెలవంక దర్శనం అనంతరం ఆ రోజు రాత్రిని లైలతుల్ జాయెజాగా వ్యవహరిస్తారు. మసీదులోల ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఎక్కువ సమయం దివ్యఖురాన్ పారాయణం శ్రవణంతో గడుపుతారు.

అల్‌విదా.. మాహే రంజాన్

మదనపల్లె సిటీ : ముస్లింలు పరమ పవిత్రంగా భావించే రంజాన్ మాసం ముగింపు దశకు చేరుకుంది. నెలరోజులుగా చేపట్టిన సహరీ... ఇఫ్తార్‌లు ముగియనున్నాయి. ఇందులో భాగంగా నేడు రంజాన్ మాసపు చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని జుమతుల్-విదాను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ఓ వైపు సంతోషాన్ని వ్యక్తపరుస్తూ మరో వైపు రంజాన్ మాసం ముగుస్తుండడంతో ఒకింత బాధపడుతూ జుమతుల్ విదా ప్రార్థనలకు సిద్ధమవుతున్నారు. ఇస్లాంలో శుక్రవారానికి అనేక ప్రాధాన్యతలు ఉన్నాయి. ముస్లింల దివ్య గ్రంథమైన ఖురాన్‌లోని సూరతుల్-జుమాలో శుక్రవారానికి గల ప్రత్యేకతలు, విశిష్టతలను తెలియజేశారు. దీనిని సయ్యదుల్ అయ్యామ్ అని కూడా పేర్కొంటారు. అన్ని రోజులలోనూ ప్రత్యేకమైన, మహిమాన్వితంగల రోజు అని దీనిర్థం. ఇస్లాం మొదటి ప్రవక్త హజరత్ ఆదమ్ అలై హిస్సలామ్ జన్మించిన రోజు, ఆయన స్వర్గ ప్రవేశం చేసిన రోజు దైవాజ్ఞ పాటించనందున ఆయనను స్వర్గం నుంచి తీసివేయబడి తిరిగి ఆయన చేసిన తౌబాను స్వీకరించి మన్నించిన రోజు కూడా శుక్రవారం అని దివ్యఖురాన్ చెబుతోంది. హజరత్ మహమ్మద్‌ను ఇస్లాం మహా ప్రవక్త గా చేస్తూ నబువ్వత్ ప్రదానం చేసిన రోజు కూడా శుక్రవారం అని దివ్యఖురాన్, హదీస్‌లలో పేర్కొనడం జరిగింది. జుమతుల్ విదాను పురస్కరించుకుని జిల్లాలోని మసీదుల్లో ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మదనపల్లె : కారు స్థంభాన్ని ఢీకొనడంతో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్ జిల్లా శిడ్లగట్ట పట్టణానికి చెందిన ఎంఎస్.బాషా (47) కుటుంబ సభ్యులైన భార్య పరీదా (38), కుమార్తె రోషిణీ (19), డ్రైవర్ ఫిరోజ్ (26)లతో కలిసి కారులో కడపకు బయలుదేరారు. తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లె సమీపంలో రోడ్డు పక్కన ఉన్న గోడను ఆనుకుని ఉన్న స్తంభాన్ని కారు అదుపు తప్పి ఢీకొంది. ప్రమాదంలో కారులోని సేఫ్టీబెలూన్స్ తెరచుకోవడంతో ముందు సీటులోని డ్రైవర్ ఫిరోజ్, ఎంఎస్.బాషా ఇద్దరూ స్వల్పంగా, వెనుక సీటులో కూర్చున్న ఫరీదా, రోషిణీలు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తంబళ్లపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టాటా ఏస్, బైక్ ఢీ : వ్యక్తి మృతి

రామాపురం : మండల పరిధిలోని బండపల్లె సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజగోపాల్‌రెడ్డి (50) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు కడప నుండి రాయచోటి వైపు వెళ్తున్న కేఏ 53 ఏఏ 4748గల టాటా ఏస్ వాహనం బండపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న ఏపీ39 జీఎక్స్ 7112 ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో రాజగోపాల్‌రెడ్డి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడు రాజగోపాల్‌రెడ్డి వైఎస్సార్ జిల్లా ఖాజీపేట మండలం తురుమల దిన్నెకు చెందినవాడిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి బంధువులకు సమాచారం అందించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

అగ్నిప్రమాదంలో డ్రిప్ పైపులు, కేబుల్‌వైరు దగ్ధం



కాలిపోయిన పైపులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు పంచాయతీలోని జింకల బోర్దు సమీప పొలాల్లో గురువారం మంటలు వ్యాపించాయి. చుట్టు పక్కల సుమారు 700 మీటర్ల వరకు వ్యవసాయ పొలాల్లో మంటలు వ్యాపించాయి. రైతులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన బుడ్డాబాబు, వలస బాలాజీ, దండు ఆజం అనే రైతులకు చెందిన 1,300 మీటర్ల పీవీసీ, పాలథిన్ పైపులు, డ్రిప్ లాడర్‌తో పాటు వంద మీటర్ల కేబుల్ వైరు, టమోటా పంట సాగు కోసం పొలంలో నిల్వ ఉంచిన 2 వేల నీలగిరి కట్టెలు కాలి బూడిద అయ్యాయి. అంతేగాక 25 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ కూడా కాలిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు పేర్కొన్నారు. ఘటనకు కారణమైన ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రైతులు పేర్కొన్నారు.

మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య

చెన్నూరు : చెన్నూరు మండలం కొక్కరాయపల్లె గ్రామానికి చెందిన పాలూరు శ్రీనివాసులు (36) కుటుంబ కలహాలు, ఒంటరితనం భరించలేక తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మృతుడు శ్రీనివాసులు మొదటి భార్యకు విడాకులు ఇచ్చి తన అక్క కుమార్తెను వివాహం చేసుకున్నాడు. అయితే రెండో భార్య మతిస్థిమితం సరిగా లేకపోవడం, మరోవైపు ఒంటరితనం వెరసి శ్రీనివాసులు మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాటుసారా స్వాధీనం : ఆరుగురి అరెస్టు



అరెస్టయిన నిందితులతో ఎస్‌ఈబీ అధికారులు

మదనపల్లె : పట్టణ శివారుప్రాంతాల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అధికారులు 340లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, రవాణాకు ఉపయోగిస్తున్న ఆటో, రెండు మోటార్ సైకిళ్లను సీజ్‌చేశారు. సారా తయారీ, రవాణా, విక్రయాలకు సంబంధించి ఆరుగురిని అరెస్ట్‌చేసి రెండు కేసులు నమోదుచేసినట్లు గురువారం ఎస్‌ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. అనంతపురం-కృష్ణగిరి జాతీయరహదారిపై తట్టివారిపల్లె క్రాస్ ఆర్టీఓ కార్యాలయానికి సమీపంలో బుధవారం రాత్రి 8గంటల సమయంలో ఏపీ-03,టీఏ-4328 ఆటోను తనిఖీ చేయగా అందులో 300 లీటర్ల నాటుసారా దొరికింది. దీంతో నిమ్మనపల్లె మండలం కందూరు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఈ.సాంబశివ(32), పుంగనూరు మండలం సుగాలిమిట్టకు చెందిన సారా తయారీదారులు బి.బాలాజీనాయక్(40), బి.శంకర్‌నాయక్(40), ఆటోకు ఎస్కార్ట్‌గా వస్తున్న పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన సారా విక్రయదారులు బి.నరసింహులునాయక్(38), బి.మదన్‌నాయక్(30)లను అరెస్ట్‌చేశారు. అలాగే మదనపల్లె పట్టణం డోర్‌నెం.5-10 ఇంటిలో అక్రమంగా నాటుసారా విక్రయిస్తుండగా దాడులు చేసి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని బాలాజీనగర్‌కు చెందిన బి.గణేష్(28) అరెస్టు చేశారు.మండలంలోని నారమాకులతండాకు చెందిన సారా సరఫరాదారు బి.శ్రీనివాసనాయక్(39)కు ఇందులో ప్రమేయం ఉన్నట్లు చెప్పారు. నాటుసారాను నియంత్రిచడంలో భాగంగా రెండుకేసుల్లోనూ నిందితులను అరెస్ట్‌చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్‌ఈబీ సిబ్బందిని అన్నమయ్యజిల్లా అడిషనల్ ఎస్పీ డాక్టర్.వి.బి.రాజ్‌కమల్ నగదు పురస్కారంతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బీఎంపీపీ సబ్‌ఇన్స్‌పెక్టర్ రాజశేఖర్, హరికుమార్, దామోదర్, ప్రసన్నకుమార్, రామచంద్ర, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కుక్కల దాడిలో గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

ములకలచెరువు : కుక్కల దాడిలో ఎనిమిది గొర్రెలు మృతిచెందిన సంఘటన గురువారం సాయంత్రం మండలంలో చోటుచేసుకుంది. బాధితుడు మల్లికార్జునరెడ్డి కథనం మేరకు... మండలంలోని పర్తికోట పంచాయతీ మామిడిగుంపులవారిపల్లెకు చెందిన మల్లికార్జునరెడ్డి గొర్రెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రతి రోజూ దగ్గరలోని అడవిలోకి గొర్రెలు మేత కోసం తోలుకొని వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో సాయంత్రం గొర్రెలు తోలుకొని ఇంటికి వచ్చే సమయంలో గొర్రెల మందపై వీధి కుక్కలు దాడికి దిగాయి. మూడు గొర్రె పిల్లలు, ఐదు గొర్రెలను చంపేశాయి. సుమారుగా రూ.60 వేలు నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం సాయంత్రం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. సుమారు 60 ఏళ్ల వయసున్న ఆ వ్యక్తి తెల్లని చుక్కలున్న లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహం వద్ద ఎర్రని చారల టవాల్ కూడా ఉంది. అతని చొక్కా జేబులో వివరాలను తెలిపే ఎలాంటి ఆధారాలు లేవని మైదుకూరు అర్బన్ పోలీసులు తెలిపారు. అనారోగ్యంతో కానీ, వడ దెబ్బ వల్ల కానీ మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఎవరైనా ఈ వృద్ధుడిని గుర్తిస్తే తమకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

కాశీనాథుని దర్శనం లేకనే...

స్వగ్రామానికి వెనుదిరిగిన యాత్రికులు



తీర్థయాత్ర ఆగిపోవడంతో వెనుదిరిగిన గుంతావారిపల్లె గ్రామస్తులు

బి.కొత్తకోట : కాశీనాథుని దర్శనం..తర్వాత ఇతరా ఆలయాలను దర్శించుకునేందుకు వెళ్లిన యాత్రికులు స్వామి దర్శనం లేకనే బుధవారం అర్ధరాత్రి స్వగ్రామానికి వెనుదిరిగారు. బి.కొత్తకోట మండలం గుంతావారిపల్లెకు చెందిన పి.వెంకటరెడ్డి (69), కే.శేఖర (30), ఎల్.సరస్వతి (45), డి.మునిస్వామి (65), జే.శంకరమ్మ (45), జే.పద్మావతమ్మ (60), పి.రఘునాథరెడ్డి (52), ఆర్.శాంతమ్మ (65), రామస్వామి (70) బృందం కాశీ, మధుర, ఇతర ఆలయాల దర్శనం కోసం సోమవారం ఉదయం బయలుదేరి బుధవారం ఉదయం మధుర రైల్వేస్టేషన్ చేరుకున్న సంగతి తెలిసిందే. వీరిలో పి.వెంకటరెడ్డి మృతి చెందడంతో యాత్ర అర్థంతరంగా ఆగిపోయింది. మధుర ప్రభుత్వ ఆస్పత్రిలో వెంకటరెడ్డి మృతదేహం తరలింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తవడంతో బుధవారం రాత్రి గుంతావారిపల్లెకు బయలుదేరింది.శుక్రవారం ఉదయం గ్రామానికి చేరుకోనుంది. వాహనంలో యాత్రకు వెళ్లిన వారిలో ముగ్గురు ఉండగా మిగిలిన ఐదుగురు అర్ధరాత్రి రైలులో వెనుదిరిగారు.వెంకటరెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలుశిక్ష



నిందితుడు బండారు చంద్రమోహన్‌రావు

కడప అర్బన్ : కడప రిమ్స్ పీఎస్ పరిధిలో 13 ఏళ్ల బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నేరం నిర్ధారణ కావడంతో నిందితుడు బండారు చంద్రమోహన్‌రావు (38)కి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 5వేలు జరిమాన విధిస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు ఇన్‌చార్జి జడ్జి, ఫస్ట్ ఏడిజే కోర్టు జడ్జి సీ.ఎస్. మూర్తి గురువారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా మూడు నెలల శిక్ష అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసు వివరాలిలా వున్నాయి. ప్రకాశం జిల్లా వేటపాలెంకు చెందిన బండారు చంద్రమోహన్‌రావు రిమ్స్ పీఎస్ పరిధిలో తైక్వాండో కోచ్‌గా ఓ స్కూల్‌లో పనిచేసేవాడు. 2019 మార్చి 21న స్కూల్‌కు చెందిన మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు బాలిక ఫిర్యాదు మేరకు అప్పటి రిమ్స్ పి.ఎస్. ఎస్‌ఐ ఏ. విద్యాసాగర్ 354 ఐపీసీ సెక్షన్ 12 ఆఫ్ పోక్సోయాక్ట్ -2012 మేరకు క్రైం నెం. 17/2019గా కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను విచారించిన తరువాత గురువారం నిందితుడికి శిక్ష ఖరారు చేస్తూ జడ్జి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్. రామసుబ్బారెడ్డి వాదించారు. సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసిన ప్రస్తుత రిమ్స్ పిఎస్ సీఐ కె. రామచంద్ర, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్స్‌పెక్టర్ మధుసూదన్‌రావు, అప్పటి రిమ్స్ ఎస్‌ఐ విద్యాసాగర్, సిబ్బందిని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభిన ందించారు.

అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు
– ఇద్దరికి గాయాలు

దువ్వూరు : మండల పరిధిలోని గుడిపాడు గ్రామం వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళుతున్న ఓ ప్రైవేటు బస్సు గుడిపాడు గ్రామం వద్దకు రాగా అతివేగంగా ప్రయాణిస్తున్న బస్సు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో 18 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు తీవ్రంగా, 16 మందికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేంద్రారెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



లావణ్య తండ్రి చిన్నయ్య ఆచారికి చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన దివ్యాంగురాలు లావణ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. గురువారం ఆకేపాడులో గల ఆకేపాటి ఎస్టేట్‌లో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు లావణ్య తండ్రి కాకర్ల చిన్నయ్య ఆచారికి రూ.5లక్షల చెక్‌ను ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులతో కలిసి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు జగనన్న ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు చొరవ తీసుకొని రూ.5లక్షలు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి, ఆకేపాటి మురళీరెడ్డి, ఏబీ మహేశ్వరరెడ్డి, పీ విశ్వనాథరెడ్డి, బీ రామ్మోహన్‌నాయుడు, దండు గోపీ, దాసరి పెంచలయ్య, జీ నాగేశ్వరెడ్డి, ఎం శ్రీనివాసులగౌడ్, ఎస్ శ్రీనివాసులు, విద్యుత్‌శాఖ డీఈఈ ఎం సురేంద్రనాథ్, రూరల్ ఏఈ ఎల్ ఈశ్వరరాజు, తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ వాత్సల్య'తో ఆర్థిక భరోసా

కడప కోటిరెడ్డిసర్కిల్ : అనాథలు, అభాగ్యులుగా మారిన 6 నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకం భరోసాగా నిలుస్తోంది. ఈ పథకం కింద ఒక్కొక్కరికి నెలకు రూ. 4 వేలు చొప్పున ఏడాది పాటు ఆర్థికసాయం అందిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 1400, కేంద్ర ప్రభుత్వం రూ. 2600 చొప్పున అందిస్తోంది. ఓవైపు ఉచితంగా చదువును అందిస్తూ మరోవైపు ఆర్థికసాయం ద్వారా అభాగ్యులైన బాలలకు ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి.గతేడాది ఏప్రిల్ నుంచి ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు.



మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసేందుకు వచ్చిన వారు

లబ్ధిదారులు ఎవరంటే?

- తల్లిదండ్రులను కోల్పోయిన లేక తల్లిదండ్రులు దూరమైన పిల్లలు
- పాక్షిక అనాథలైన (తల్లి లేక తండ్రిని కోల్పోయిన, విడాకులు పొందిన) పిల్లలు, కుటుంబాలను వదిలివేసిన తల్లిదండ్రులు, ప్రాణాంతకమైన వ్యాధి బారిన పడిన వారి పిల్లలు.
- పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన పిల్లలు
- బాలల న్యాయ ఆదరణ సంరక్షణ చట్టం-2015 ప్రకారం ఇల్లులేని పిల్లలు
- ప్రకృతి వైపరీత్యానికి గురైన బాలలు, బాల కార్మికులు
- అక్రమ రవాణాకు గురైన బాలలు, బాల యాచకులు
- బాల్య వివాహ బాధితులు, హెచ్‌ఐవీ బాధిత, దివ్యాంగుల పిల్లలు

గతేడాది రూ. 1.71 కోట్లు అందజేత

మిషన్ వాత్సల్య పథకం ద్వారా గతేడాది జిల్లాలో 614 మంది పిల్లలకు నెలకు ఒక్కొక్కరికి రూ. 4 వేల చొప్పున రూ. 1,71,92,000 అందించారు. ఈ ఏడాది 6510 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఇప్పటివరకు 6510 దరఖాస్తులు

మిషన్ వాత్సల్య పథకానికి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 6510 దరఖాస్తులు వచ్చాయి. మండల స్క్రూటినీ కమిటీ పరిశీలన అనంతరం అర్హులను ఎంపిక చేస్తారు. అలాగే గతేడాది 614 మందిని రెన్యూవల్ చేస్తున్నాం. ఏడాదిపాటు లబ్ధిదారులకు నెలకు ఒక్కొక్కరికి రూ.4 వేలు చొప్పున అందజేయనున్నాం.
– ఎంఎస్ రాణి, పీడీ, మహిళా శిశు సంక్షేమశాఖ, కడప

దరఖాస్తులను మండలస్థాయి స్క్రూటినీ కమిటీ సభ్యులు, తహసీల్దార్, ఎంపీడీఓ లేదా మున్సిపల్ కమిషనర్, ఎంఈఓ, సీడీపీఓలు, సూపర్‌వైజర్ పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి రూ. 4 వేలు చొప్పున 12 నెలలపాటు ఆర్థికసాయం అందిస్తారు. గతేడాది లబ్ధిదారులను రెన్యూవల్ చేయడంతోపాటు కొత్త వారికి కూడా ఆర్థికసాయం అందించనున్నారు. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోదలిచిన వారు సంబంధిత సచివాలయంలోని మహిళా పోలీసు ద్వారా సీడీపీఓకు అందజేయాల్సి ఉంటుంది.